

# కన్నకొడుకు

— రజని

గుండె గాయపడడం అది మొదటిసారికాదు కమలమ్మకి. కానీ కలుక్కుమన్న బాధ రోజంతా సలుపుతూనే ఉంది. ఇంతెత్తు మనిషిని తీసిపారేసినట్టుగా కొడుకు అన్న మాటలను తలచుకుని కుమిలిపోతూనే ఉంది.

అసలు చిన్నప్పట్నుంచీ కుటుంబంలో ఎంత పెద్ద సమస్య రానీ పెదవి విప్పి తన అభిప్రాయం ఎప్పుడూ వెలిబుచ్చలేదు ఆమె. చాలా సందర్భాలలో ఆమె మనసులో మాట అక్కడే అణగిపోయేది. బాధని, ఆందోళనను ఇలా ప్రతి భావాన్ని లోలోపలే నొక్కిపెట్టడం స్వభావరీత్యానో, అనుభవరీత్యానో ఆమెకు ఎప్పుడో అలవడింది.

ఈ రోజైనా అసలు ఎందుకు నోరు విప్పానా అని అభిమానపడింది. ఆ రోజు ముద్ద నోటికి పోలేదు. బుగ్గన చెయ్యాన్చుకుని శూన్యంలోకి చూస్తూ అలానే కూచుంది.

పొద్దున ఎనిమిది గంటల వేళ ఊరి కరణంగా పనిచేసిన మనిషి, ఇంకో ఇద్దరు రావడం, కోడలు హడావుడిగా వాళ్ళకి కాఫీ కలిపి మర్యాద చేయడం, ఓ పక్క వంటపనిలో మునిగి ఉన్న కమలమ్మ వెంటనే గమనించలేదు కానీ... కొంగు చేతికి తుడుచుకుంటూ హాలు పక్కనుంచి వెళ్లబోయి లోపల్నుంచి వినబడిన సంభాషణతో ఆగిపోయింది. "లేదు మాధవయ్యా, అసలు చాలా తక్కువ రేటుకే మేము అమ్ముకుంటున్నట్టు లెక్క. ఇప్పుడు పల్లెటూరు వెళ్లి అద్దెలవీ వసూలు చేసే ఓపికా, తీరికా లేక బేరం పెట్టవలసి వచ్చింది" ఇంకా ఏదో చెబుతున్నాడు భాస్కరం.

కమలమ్మకి ఓ పట్టాన అర్థం కాలేదు. సంగతి బోధ పడ్డాక కాసేపు రాయిలా ఉండిపోయింది. అంటే... ఊళ్లో ఇల్లు అమ్మకానికి పెట్టేశాడా! ఇల్లు అమ్మకానికి పెట్టడంకంటే ఓ మాట మాత్రం తన చెవిన వెయ్యకపోవడం దిగ్భ్రాంతిగా, అవమానకరంగా తోచింది కమలమ్మకి. తండ్రితో తనుకూడా పోయిందనుకున్నాడు కాబోలు. ఓ ముక్క కూడా చెప్పాడు కాదు.

హాలులో బేరసారాలు సాగుతూనే ఉన్నాయి. ఉండబట్టలేకపోయింది కమలమ్మ. వాళ్ల మాటలు ఒక్కొక్కటీ గుండెలో గునపాలుగా దిగుతున్నట్టనిపిస్తోంది. "అబ్బాయి భాస్కరం." కర్టెన్ చాటునుంచి సన్నగా పిలిచింది. ఆ స్వరం కొద్దిగా కంపించింది కూడా. ఒకసారి కాదు, నాలుగుసార్లు పిలవగా భాస్కరం లోపలికి వచ్చాడు.

"ఏమిటి?" అంటూ ఎర్రగా కందగడ్డలా ఉన్న అతని ముఖం చూసి కొంచెం జంకింది. నిజంగానే అతడు కోపంగానే ఉన్నాడు. అవతల తనేదో ముఖ్యమైన వ్యవహారంలో ఉంటే ఇప్పుడు పిలవడం ఏమిటి అన్నట్టుగా విసుగ్గా చూశాడు.

తటపటాయించి అంది —"ఇల్లు అమ్మడం అని వింటున్నాను. నిజమేనా?"

"అవును. ఊళ్లో ఇల్లు బేరానికి పెట్టాను."

ముఖం చిట్లించుకుని చెప్పాడు చాలా అన్నట్టు.

"అదికాదురా. ఎన్నో ఏళ్లుగా ఆ ఇంట్లోనే బతుకు గడిపాను. నేనున్న నాలుగు రోజులు ఆ ఇంటిని అమ్మే ప్రయత్నం చేయకు."

కమలమ్మ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. దాదాపు వేడుకుంటున్నట్టే అడిగింది.

అంతే చిటపటలాడిపోయాడు భాస్కరం.

"అసలు నీకెందుకు? నేను ఇల్లే అమ్ముతానో, వాకిలే అమ్ముతానో నా ఇష్టం. ఏది చెయ్యాలో మానాలో నాకు తెలుసు. ఆడదానివి నీ సలహా ఏం అక్కరలేదు." అనేశాడు.

అరవయ్యేళ్లు పైబడిన తల్లిని గడ్డిపోచ కన్నా హీనంగా తీసిపారేస్తూ అతడు మాట్లాడుతుంటే సిగ్గుతో తల చితికిపోయింది కమలమ్మకి. ఇంట్లో ఎవరి మొహం చూడలేక గదిలోకి వెళ్లి కూర్చుంది. ఈ భారతదేశంలో సగటు మగవాడు తల్లికి ఇచ్చే గౌరవస్థానం ఇదే అన్న విషయం పచ్చిగా ఆమెకు తెలియజెప్పాడు భాస్కరం.

ఆడవాళ్లు ఇంత ముఖ్యమైన విషయాల్లో తలదూర్చడమేమిటి అని చికాకు పడిపోయాడు. మరికొంతసేపటికి రేటు స్థిరపరచుకుని వాళ్లు గుమ్మం దాటాకా భాస్కరం లోపలికి వచ్చి భోజనం చేసి తీరికగా వక్కపొడి నములుతూ బ్యాంకుకు వెళ్లిపోయాడు.

కొడుకు తన మాటకి ఆవగింజంత కూడా విలువ ఇవ్వకపోవడం కమలమ్మకి తీరని బాధ కలిగించింది. చిన్నతనంలో తండ్రి అరుపులు, కేకల మధ్య భయంభయంగా మసిలేది. పదమూడేళ్లకి పెళ్లయినప్పటినుంచి భర్త అదుపాజ్ఞలలో నాలుగు దశాబ్దాలు పైన గడిచిన జీవితం ఏనాడో యాంత్రికంగా మారిపోయింది. పొలంలో పనిచేసే వాళ్లచేత ఇంటిపనులు చేయిస్తే పైన ధాన్యం కొలిచివ్వాలని చెప్పి చెల్లెలిచేత, తనచేత ఇంటి చాకిరీ అంతా చేయించేవాడు తండ్రి. తల్లి సరేసరి— ఎప్పుడూ పొయ్యి ఊదుతూ వంట పనిలోనే మునిగేది. చెరువుకెళ్లి నీళ్లు తీసుకురావడం, బండెడు అంట్లు తోమడం, పశువుల పోషణ ఇవన్నీ చేయలేక తమ అక్కచెల్లెళ్ల లేతచేతులు బొబ్బలెక్కిపోయేవి. ఇంటిల్లిపాది విడిచిన బట్టలు ఉతికి ఆరేసేవారు. అన్నదమ్ములు ఆ బట్టలు వేసుకుని దర్జాగా వరండాలో చెక్కకుర్చీలమీద కూర్చుని చదువుకునేవారు.

పెళ్లితో జీవితం మెరుగుపడుతుందని ఆశించింది కానీ ఇంకా అధ్వాన్నమవుతుందనుకోలేదు. ఆమెను ఏనాడూ మనిషిగా చూసి మెలగలేదు నరసింహయ్య. ఇంటికి తెచ్చుకున్న ఓ గేదెనో, ఆవునో చూసినట్టే తప్పితే రక్తమాంసాలున్న వ్యక్తిగా ఆయనెప్పుడూ గౌరవించి మసలలేదు. ఇంటికి సంబంధించిన ఏ నిర్ణయమైనా ఏకపక్షంగా అతనే అమలు చేసేవాడు. మగపిల్లవాడిని పక్క ఊరు పంపించి కాలేజి చదువు చెప్పించాడు. ఆడపిల్లలిద్దరికీ పదో క్లాసు కూడా పూర్తి చేయనివ్వకుండా ముడిపెట్టి పంపించాడు.

భర్తలు తెచ్చే చాలీచాలని సంపాదనతో సంసారాలతో కూతుళ్లు పడే అవస్థ చూస్తూ కళ్లనీళ్లు పెట్టుకోవడం మినహా మరేమీ చేయలేకపోతోంది కమలమ్మ. బతికినన్నాళ్లు సింహంలా భార్యని అదిలిస్తూ, బెదరిస్తూనే గడిపాడు నరసింహయ్య. ఇక కొడుకు దగ్గర చేరక తప్పిందికాదు కమలమ్మకి. ఏదో తప్పదన్నట్లు, లోకం ఏమనుకునిపోతుందోనన్నట్టు ఇంట్లో ఉండనిచ్చి నాలుగు మెతుకులు పెడుతున్నాడే కాని, ఏ రోజూ ఎలా ఉన్నావు అని యోగక్షేమాలు కనుక్కున్న పాపానపోలేదు. కొడుకుకేలేని ప్రేమ పరాయి పిల్లకేం వస్తుంది. కోడలు కూడా అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తుంది.

ఇంట్లో అందరికీ వండి వార్చి రోజులు వెళ్లదీస్తోంది కమలమ్మ.

కనిపెంచిన తల్లి అంటేనే మమకారం లేనివాడికి పల్లెలో నిర్జీవమైన ఆ పెంకుటింటిమీద ఏం అభిమానం ఉంటుంది. ఏళ్ల తరబడి నీడ ఇచ్చింది అని కృతజ్ఞతాభావం ఎలా కలుగుతుంది?

తన ప్రమేయం లేకుండా ఇల్లు చేతులు మారిపోతుంటే కళ్లలో నీళ్లు కూడా ఆరిపోయి శిలలా ఉండిపోయింది కమలమ్మ.

చాలా యాంత్రికంగా గడిచిపోతున్న ఆమె జీవితంలో చిన్న ఆశాకిరణం శ్రీదేవి.

"ఏమిటె నాన్నమ్మా, ఏదో ఆలోచిస్తున్నావు?" పెరుగు వెయ్యబోయి చారుగిన్నె వంపుతుంటే ఆశ్చర్యపోతూ అడిగింది శ్రీదేవి.

శ్రీదేవి ఇంటర్ చదువుతోంది. బాగా చదువుతూ తెలివిగల పిల్లగా ఇంటా బయటా మంచిపేరు తెచ్చుకుంటోంది. అయితే కూతురి తెలివితేటలు భాస్కరానికి పట్టడం లేదు. అతని ధ్యాస ఎప్పుడూ కొడుకుమీదే. కొడుక్కు ఎలాగైనా ఇంజనీరింగ్‌లో సీటు రావాలని ముందునుంచీ ట్యూషన్ పెట్టించి వేలకి వేలు ఖర్చు చేస్తున్నాడు. కూతురికి ఇంటర్ అయిపోగానే పెళ్లిచేసి పంపేద్దామనే అతని ఉద్దేశం.

హైస్కూలు చదువు త్వరగా పూర్తిచేసి అన్నగారితో సమానంగా ఇంటర్ సెకండియర్ చదువుతోంది శ్రీదేవి. ఆ రోజు మ్యాథ్స్‌లో ఇంటిగ్రేషన్ ఎంతకీ తెగడం లేదు శ్రీకాంత్‌కి. అరగంటనుంచీ ప్రాబ్లం ఓ కొలిక్కి రాక తల పగిలిపోతోంది.

కమలమ్మ హాలులో ఓ మూల కూర్చుని భాగవతం చదువుకుంటోంది. తల్లి రెండు సార్లు టీ కలిపి ఇచ్చింది.

అయినా ఇదేం లెక్క. ఎంత ప్రయత్నించినా సాల్వ్ కాకపోవడం విసుగు తెప్పించింది. సాయంత్రం ఫ్రెండ్స్‌తో బాడ్మింటన్ ఆడివచ్చాడేమో కళ్లు మూతలు పడిపోతున్నాయి. కానీ లాభం లేదు. ఇవన్నీ సాల్వ్ చేయకపోతే రేపు ట్యూషన్ మాస్టర్ ఊరుకోడు. నాన్నకి కంప్లయింట్ చేస్తే అమ్మో ఇంకేమన్నా ఉందా! రాంక్ తెచ్చుకోకపోతే ఊరుకోను అని నాన్న కచ్చితంగా చెప్పాడు.

శ్రీదేవి అక్కడే కూర్చుని ఫిజిక్స్ చదువుతోంది. చెల్లెల్ని అడుగుదామా అనుకున్నాడు కానీ... ఛీ... తాను మగవాడు, పెద్దవాడు. చెల్లెల్ని లెక్క అడగడమా! అభిమానంతో ఊరుకున్నాడు.

"హుఁ... ఇదేం లెక్క!"

అన్నగారి అసహనాన్ని చూస్తూ శ్రీదేవి చిరునవ్వు నవ్వింది. "ఇలా ఇవ్వు. నేను ట్రై చేస్తా." అని చెయ్యి చాపింది. కానీ పుస్తకం ఇవ్వడానికి శ్రీకాంత్‌కి అభిమానం అడ్డొచ్చింది. ముఖం ముడుచుకుని అలాగే టేబిల్ ముందు కుర్చీలో కూర్చుని ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు.

"చూశావా నాన్నమ్మా! ప్రాబ్లం చేస్తానంటే అన్నయ్యకెంత నామోషీగా ఉందో!" శ్రీదేవి ఎంతో కనిపెట్టినట్టే ఫిర్యాదు చేసింది.

ఆ మాటలు చీరకి ఎంబ్రాయిడరీ చేస్తున్న కోడలు, భాగవతం చదువుతున్న అత్తా తెల్లబోతూనే విన్నారు. నిజం. నిండా 18 ఏళ్లు లేని శ్రీకాంత్‌లో మగవాడిననే తలబిరుసుతనం అడుగడుగునా కనిపిస్తూనే ఉంది వారిద్దరికీ. వీడు తమ చేతుల్లో పెరిగిన పిల్లాడేనా అని ఆశ్చర్యపోతున్నారు. ఎందుకంటే శ్రీకాంత్‌కి ఆడవాళ్లు అంటే చిన్నచూపు నరనరానా

### సరికొత్త జంట



ఇటీవల మాజీ క్రికెట్ వీరుడు కపిల్‌దేవ్ నిర్వహించిన ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంలో, చాలామంది బాలీవుడ్ తారలు క్రికెట్ తారలను కలుకున్నారు. ఇది మామూలువార్త, కానీ క్రికెట్ ఆటగాడు అజయ్ జడేజాను, రవీనాటాండన్ కలవడం విశేషవార్త. వీళ్లిద్దరూ అన్నిచోట్లా దాదాపు కలిసే కనబడ్డారుట జనానికి. చెన్నయ్‌వెళ్లిన ఫ్లయిట్‌లోనూ కలిసే ఉన్నారుట. మరో ఫ్యాషన్ సంస్థ నిర్వహించిన అవార్డుల ఫంక్షన్‌కూ కలిసేవెళ్లారు. ఇదేదో పెద్ద దుమారానికి నాందిలా కనబడుతుందని అబిమానలు చెవులు కొరుక్కుంటున్నారు. పరిణామాల కోసం ఎదురుచూట్టమే మనం చేయగలిగింది!

ఉంది. బయట తిరుగుతున్న సమాజం, సినిమాలు, వర్తమాన సంస్కృతి అంతా ఆడవాళ్లు అంటే మనకింద బతికేవాళ్లే సుమా అన్న ధోరణి చిన్నప్పట్నుంచీ నేర్పుతూనే ఉన్నాయి. రేడియోలో, టీవీలో, పత్రికలలో స్త్రీ పురుషుల సమానత్వం అని వచ్చే వ్యాసాలు, నాటికలు అత్తాకోడళ్లు పనిపాటలు చేస్తూ వింటూనే ఉంటారు. చిన్నప్పట్నుంచీ పిల్లల్ని తేడాగా పెంచకూడదనీ, వేరువేరు అన్న భావన వాళ్లలో రాకూడదనీ వచ్చే ప్రసంగాలు శ్రద్ధగా ఆలకిస్తారు. ఏమో! నేనెప్పుడైనా పిల్లల్ని అలా తేడాగా చూశానా అని తర్కించుకుంటూ ఉంటుంది కమలమ్మ.

ఒక్కడే కొడుకని భాస్కరాన్ని నెత్తిమీద పెట్టుకుని పెంచిందేమీ లేదు. ముగ్గురాడ పిల్లలతో సమానంగానే అతనినీ చూసింది. ఎప్పుడూ ఆడపిల్లలు మనసు కష్టపెట్టుకునే విధంగా ప్రవర్తించలేదు కమలమ్మ. కానీ కొంతమంది తల్లులు అలా ఉంటారు. మగపిల్లలకి బలమైన తిండి పెట్టి పెంచుతారు అని వచ్చే వ్యాసాలు చూసి విస్తుబోతుంది. అలాంటివాళ్లు ఉంటారా? కని పెంచే తల్లికే పిల్లలమీద సమానభావం లేనప్పుడు ఇక సమాజంలో ఎలా వస్తుంది?

ఇక కోడలు ఇద్దరు పిల్లల్నీ ఓ తీరుగానే పెంచుతుంది తప్ప ఆడపిల్ల అని చులకన భావంతో శ్రీదేవిని ఎప్పుడూ చూడదు. తల్లి ప్రేమ ఇద్దరికీ సమానంగానే అందుతుంది. కానీ తండ్రి విషయానికి వచ్చేసరికి ఎంతో తేడా కనిపిస్తోంది కమలమ్మకి.

పండగొచ్చినా, పబ్బమొచ్చినా ముందు పుత్రరత్నాన్నే దృష్టిలో పెట్టుకుని మంచిబట్టలు కొంటాడు భాస్కరం. ఆ తర్వాత చేతిలో ఉండే డబ్బుల్ని బట్టే మిగతా వాళ్లకి.

మరి పండుగనాడు ఇంట్లో చేసిన పిండి వంటల్ని కోడలు అంత భేదభావంతో పెడుతుందా. కమలమ్మకి ఏదో మబ్బుతెర విడిపోయినట్టుగా తోచింది. పురుషాధికార వ్యవస్థను పురుషులు ఎప్పుడూ పదిలంగా కాపాడుతూ ఉంటారు. మొత్తానికి శ్రీకాంత్ చెల్లెల్ని లెక్క అడగలేదు. శ్రీదేవి పౌరుషాన్ని పక్కకిపెట్టి అన్నగారి దగ్గరకెళ్లి మూడు నిముషాల్లో ప్రాబ్లం స్వాల్ చేసి వచ్చి కూర్చుని తన చదువులో నిమగ్నమైపోయింది.

తను అంత తంటాలు పడినా రాని ప్రాబ్లం చెల్లెలు అవలీలగా సాల్వ్ చేయడం శ్రీకాంత్‌ను ఓ క్షణం దిగ్భ్రమలో ముంచింది. ట్యూషన్ మాస్టారు కూడా ఇంత స్పీడ్‌గా చేయలేడు అని అనుకున్నాడు కూడా. చెల్లెలిమీద ఓ విధమైన గౌరవభావం ఏర్పడబోయింది. అంతలోనే ఆ... ఆడపిల్ల అన్న భావన దానిని అణచివేసింది.

ఎంబ్రాయిడరీ కుడుతూ కోడలు, భాగవతం చదువుతూ అత్త ఆలోచిస్తూనే ఉన్నారు. ఇంత తెలివిగల పిల్ల చివరికి తండ్రి చెప్పిన ఏ తల మాసిన సంబంధానికో తలవంచి జీవితాంతం అతనికి వండిపెడుతూ సామాన్య జీవితం గడపాల్సిందేనా! చాదస్తపు తండ్రి ఉన్నందుకు శ్రీదేవికి ఈ కష్టాలు తప్పవా! కానీ భాస్కరాన్ని ఎదిరించే ధైర్యం వాళ్లిద్దరికీ లేదు.

★ ★ ★

"డాడీ! నేనుకూడా ఎంట్రెన్స్ రాస్తున్నాను" అని ప్రకటించింది శ్రీదేవి.

"అదేమిటి? ఎందుకు? అయినా నిన్ను ఇంకా చదివించాలనుకోవడం లేదు." భాస్కరం కూతురికి ఎంతో నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. కానీ శ్రీదేవి వినలేదు. పట్టుదలగా రాసింది. ఎటువంటి ట్యూషన్ లేకుండా శ్రీదేవి రాంక్ తెచ్చుకుంటే, శ్రీకాంత్ నెంబర్ ఎక్కడో చివరిలో ఉంది. ఆ నెంబర్‌కి ఇండియాలో ఎక్కడా కూడా సీటు దొరకదు. ఆ రోజంతా తండ్రికి మొహం చూపించలేదు శ్రీకాంత్. ఫ్రెండ్స్‌తో సినిమాకు పారిపోయాడు.

భాస్కరం ఇరుకున పడ్డట్టే అయ్యాడు. వంశోద్ధారకుడు, కులదీపం అనుకున్న



కొడుకు పుస్తకాలు వదలేసి రోడ్డెక్కాడు. చదువు అవసరం లేదు అనుకున్న కూతురు మంచి మెరిట్‌లో వచ్చింది.

"దానికి చదువు వస్తుంటే అడ్డుకోవడానికి మనమెవరం? కాలేజీలో చేర్పించండి" అన్న భార్యవైపు అయోమయంగా చూశాడు.

"అసలు దీనికి చదువుమీద నేను పెట్టుబడి ఏమీ పెట్టదలచుకోలేదు తెలుసా! ఇప్పుడు దీన్ని చదివిస్తే ఆ స్థాయిలో చదివిన వాడినే తీసుకురావాలి. దీని బదులు వాడు తెచ్చుకుంటే రాంక్ బాగుండేది" అని విసుక్కున్నాడు. శ్రీదేవి ఇంజనీరింగ్‌లో చేరింది. సంబంధాలకోసం చూస్తూనే ఉన్నాడు భాస్కరం. థర్డ్ ఇయర్‌లోకి వచ్చింది శ్రీదేవి. తండ్రి మూడేళ్లనుంచి పెళ్లిగురించి ఆలోచిస్తున్నా శ్రీదేవికి ఆ ధ్యాసే లేదు. కమలమ్మకి చాలా సందేహంగానే ఉంది. పెళ్లి విషయంలో శ్రీదేవి తండ్రి మాటని ఎలా కాదనగలదా అని.

### కాజోల్ కొత్త చిత్రం?!

పెళ్లి తరువాత కాజోల్ ఒప్పుకున్న మొదటి చిత్రం సంజయ్ లీలా భన్సాలీ చిత్రమని వార్తలు వినబడుతున్నాయి. అయితే ఆ విషయాన్ని సంజయ్ మాత్రం కాదంటున్నాడు. ఎందుకంటే తరువాత నిర్మించబోయే చిత్రంగురించి తానే



ఏమీ ఆలోచించనప్పుడు, ఇటువంటి పుకార్లు ఎలా పుడతాయోనని ఆశ్చర్యం ప్రకటిస్తున్నారు. అయినా ఇక్కడో తమాషా ఉంది. సంజయ్ భన్సాలి ప్రతిసారీ సినిమా మొదలుపెట్టి, అందులో మాధురీ దీక్షిత్‌ను హీరోయిన్‌గా పెట్టుకుందామనుకుంటాడు. కాని ఆ పాత్ర మరో హీరోయిన్ కెవరికో సూట్ అవుతుంది. 'హమ్ దిల్‌దే చుకే సనమ్'లో అలాగే అనుకుంటే, చివరికి ఆ పాత్ర ఐశ్వర్యను వరించింది. మరో కొత్తచిత్రం కాజోల్ కాకపోతే మరెవర్ని వరిస్తుందో చూడాలి!

డ్రాయింగ్ రూంలో శ్రీదేవి స్నేహితురాలు భార్గవి "మన నీలిమకి మ్యారేజి సెటిలైంది. డౌరీ రెండు లక్షలపైనే. అతను బ్యాంకు ఆఫీసరట."

"అలానా! రెండు లక్షలతో హబ్బీని కొనుక్కుందన్నమాట నీలిమ. ఛ! అలాంటి పెళ్లిళ్ల జోలికి మనం పోవద్దు. అసలు ఇద్దరిమధ్య లవ్ అనేదే లేకపోతే పెళ్లేమిటి? పెద్దవాళ్లు ఎవరిని చూపిస్తే వాళ్లచేత తాడు కట్టించుకోవడం ఎంత నాన్సెన్స్. అసలు ఇలాంటి సంప్రదాయాలు మనకి వద్దు" అంది శ్రీదేవి.

మరో ఫ్రెండ్ వినీత కూడా ఆ అభిప్రాయంతో ఏకీభవించింది.

"నిజమే. పెళ్లిళ్లు పెద్దవాళ్లు కుదర్చడమేమిటి? మనల్ని బొమ్మల్లాచేసి కూర్చోబెట్టి వేడుకలు జరపడమేమిటి? ఒప్పుకోకూడదు ఇలాంటి పద్ధతులను! మనకి నచ్చినవాళ్లు తటస్థపడితే మనమే చేసుకుంటాం" అంది తేలికగా.

హాలులో కూర్చున్న కమలమ్మ గుమ్మానికి చేరబడి చేతిలో పుస్తకం పక్కనపెట్టింది. కళ్లజోడు సర్దుకుంది. నిజమే. ఇంత సామాన్యమైన విషయానికి భాస్కరం రోజూ ఇంట్లో బుర్ర బద్దలు కొట్టుకోవడం ఎందుకు? వాళ్లు ఇంత కట్నం అడిగారు, వీళ్లు ఇన్ని లాంఛనాలు అడిగారు అని!

చాలా ముందుకు దూసుకుపోతున్న ఈ తరం అమ్మాయిలను చూస్తుంటే కమలమ్మకి ఇప్పుడు ఏ ముల్లులాంటి భావాలు గాయపర్చడంలేదు. వీళ్లు జీవితంలో ఎప్పుడూ విజయాలు సాధిస్తూనే ఉండాలి. ఆనందంతో చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంది.

●